క్లుప్తంగా

నేడు కొమరగిరిలో ఉచిత వైద్య శిబిరం

ఐ.పోలవరం: మండలంలోని కొమరగిరి గ్రామంలో నవభారత్ గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్ అంగాడి రేవతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో మల్టీ స్పెషాలిటీ వైద్యులు రోగులను పరీక్షిస్తారని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఫిజియోథెరపీ బాల్స్ పంపిణీ



విద్యార్థులకు ఫిజియోథెరపీ బాల్స్ అందజేస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక వడ్డిగూడెంలోని శ్రేయ స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూలులో బుధవారం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శి వలవల వెంకటరెడ్డినాయుడు, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా తదితరుల చేతుల మీదుగా దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ బాల్స్ పంపిణీ చేశారు. వాకర్ కొల్లూరి మధుసూదనరావు మనవరాలు సుస్మిత పుట్టినరోజు సందర్భంగా ఈ వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ జోన్ చైర్మన్ యర్రమిల్లి సత్యనారాయణ మూర్తి, శ్రేయ స్కూలు ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు.

ఎంట్రుకోన సర్పంచ్ తిక్కిరెడ్డికి పురస్కారం



మంత్రి వేణు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సర్పంచ్ శ్రీనివాసరావు

అల్లవరం: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు గోదావరి కళాదర్బార్ పురస్కారాలను ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు చేతుల మీదుగా అల్లవరం మండలం ఎంట్రుకోన సర్పంచ్ తిక్కిరెడ్డి నాగవెంకట శ్రీనివాసరావు పురస్కారం, మెమోంటో అందుకున్నారు. పురస్కార గ్రహీత శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

మద్యం వ్యాపారులతో సమావేశం

యానాం: నియోజకవర్గ పరిధిలోని హోల్‌సేల్, రిటైల్ లైసెన్స్‌డ్ మద్యం వ్యాపారులకు బుధవారం స్థానిక ఆర్‌ఏఓ చాంబర్‌లో ఆర్‌ఏఓ మునిస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. రాబోయే లోక్‌సభ, సాధారణ ఎన్నికల సందర్భంగా మద్యం అమ్మకాలు, మద్యం అక్రమ రవాణా, దుకాణాల వద్ద సమయ పాలన అమలు తదితర విషయాలను చర్చించారు. మద్యం అక్రమ రవాణా జరగకుండా అందరూ సహకరించాలని, ఎక్సైజ్ శాఖ ఇచ్చిన నిబంధనలను తప్పకుండా పాటించాలని వ్యాపారులకు సూచించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థినికి పరీక్ష సామగ్రి అందజేస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్.యానం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాలలో బుధవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఎస్.యానం రవ్వ ప్లాంట్ యాజమాన్యమైన వేదాంత కెయిర్న్ సంస్థ సహకారంతో మిత్ర హోలీస్టిక్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వైఎస్సార్ సీపీ నాయకుడు జోగి రాజా, ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, హెచ్‌ఎం బి.అప్పారావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బీర బాలరాజులు అందజేశారు.

దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన ఇంటర్వ్యూలు

యానాం: పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అమలుచేసే దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన–జాతీయ పట్టణ ఉపాధి పథకంలో సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ రుణానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామకృష్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ అయితాబత్తుల వెంకటరమణ, మిషన్ మేనేజర్ కరుణ్‌కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

ఆధునీకరణ.. అందని ద్రాక్షేనా..!

- తీర గ్రామాల ప్రజల దాహం తీరుస్తున్న దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకం
- ఏళ్లు గడుస్తున్నా చెరువులో పూడిక తీయని పరిస్థితి



పిచ్చిమొక్కలతో నిండిపోయిన దరియాలతిప్ప మంచినీటి చెరువు



రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకు

యానాం: తీర ప్రాంత గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చే దరియాలతిప్ప రక్షిత మంచి నీటి పథకాన్ని అధికారులు గాలికొదిలేశారు. ప్రధానంగా మంచినీటి చెరువు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా కన్నెత్తి చూసేవారు లేరు. దశాబ్దాల తరబడి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలంటూ స్థానికులు మొత్తుకుంటున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. ఏళ్ల తరబడి మంచినీటి ప్రాజెక్టును ఆధునీకరించాలన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.

1997లో దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించి అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ రాజేంద్ర కుమారి బాజ్‌పేయి చేతుల మీదుగా ప్రారంభించారు. దీని ద్వారా నియోజకవర్గానికి శివారున ఉన్న తీరగ్రామాలైన సావిత్రినగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, దొమ్మేటిపేట, పరంపేటతో సహా పది గ్రామాల ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత రెండు దశాబ్దాలుగా తీర గ్రామాలకు దాహార్తిని తీర్చే కీలకమైన మంచినీటి ప్రాజెక్టుగా నిలిచింది. అయితే పథకం పరిధిలోని రక్షిత మంచినీటి చెరువును శుభ్రం చేయకుండా వదిలేయడంతో చెరువు పరిసరాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. మరోవైపు చెరువు చుట్టూ ఇప్పటివరకూ రివిట్‌మెంట్ పనులు చేయకపోవడంతో పరిశుభ్రత లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు దశాబ్దాల తరబడి చెరువులో పూడికను తీయకుండా వదిలేయడంతో అది ఊబిగా మారిపోతుందంటున్నారు. మరోవైపు చెరువులో అపరిశుభ్రత కారణంగా తీర గ్రామాలకు సరఫరా చేస్తున్న నీరు నలుపు రంగులో ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఖరికి పత్తిగొంది సమీపంలోని ఫ్రెంచి కెనాల్ నుంచి కాలువ ద్వారా వచ్చే నీరు సైతం పూడికతో ఉంటుందని, ఆ నీటినే రక్షిత మంచినీటి పథకం వద్ద శుభ్రం చేసి ఇచ్చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిపుణులను తీసుకొచ్చి అధ్యయనం చేసి గ్రౌండ్ లెవల్ వరకూ పూడిక తీయించి చెరువు ఆధునీకరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకాన్ని ఆధునీకరించాలంటూ ఇటీవలే ఆర్‌ఏఓ మునిస్వామికి ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రం అందించారు.

> **మీరు చేయకపోతే మాకు అప్పగించండి**
>
> 
>
> దరియాలతిప్ప రక్షిత మంచినీటి చెరువు ఆధునీకరణ చేయాలంటూ చాలా ఏళ్లుగా అధికారులను కోరుతున్నాం. అయినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. చెరువు పూడిక తీయకపోవడంతో సరఫరా చేసే నీళ్లు నల్లగా వస్తున్నాయి. వాటిని తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రభుత్వం చేయకపోతే చెరువును గ్రామస్తులకు అప్పగిస్తే బాగు చేసుకుంటాం.
>
> – సబ్బతి శ్రీనివాసరావు, గ్రామపెద్ద, దరియాలతిప్ప

సీఎం జగన్ ముస్లిం మైనారిటీల పక్షపాతి



మసీదు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం మైనారిటీల పక్షపాతి అని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. మండలంలోని తాండవపల్లిలో రూ.3 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన మస్జిద్ ఇ ముస్తఫా మసీదు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ మైనారిటీలను అక్కున చేర్చుకున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ఎప్పటికీ మరువబోమన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు ఎండీవై షరీఫ్, రబ్బాని, కర్రార్ హుస్సేన్, ఖాజా బాబు, సర్పంచ్ గంగుమళ్ళ ఏసుబాబు, మసీదు ముత్తవల్లి అబ్దుల్ ఖాదర్ జిలాని, అబ్దుల్ కరీం, సెక్రటరీ అమీర్, మసీదు గురువు ఫర్ మాన్ రజా పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మాతృభాషా దినోత్సవం



నృత్య కళాకారిణి బేబి సత్యవాణిని సత్కరిస్తున్న ప్రముఖులు



నవోదయలో మాతృభాషా దినోత్సవంలో పాల్గొన్న టీచర్లు, విద్యార్థులు

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల శాంతినికేతన్ పాఠశాలలో ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏర్పాటుచేసిన ప్రముఖ చిత్రకారుడు కాకర్లపూడి కేశవవర్మ చిత్ర గ్యాలరీ అందరినీ ఆకట్టుకుంది. కుమారి రావి బేబి సత్యవాణి నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. చిత్ర గ్యాలరీని మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రారంభించారు. అనంతరం కవులను, నృత్య కళాకారులను, తెలుగు పండితులను సత్కరించారు. కార్యక్రమంలో చెల్లి వివేకానంద, జి.వెంకట్రాజు, పి.వెంకటేశ్వరావు, జంధ్యాల సీతారామారావు పాల్గొన్నారు.

మాతృభాష ప్రాధాన్యతను గుర్తించాలి

యానాం: మాతృభాష ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవచ్చు, నేర్చుకోవచ్చు కాని సంస్కృతిని కాపాడుకోవాలంటే మాతృభాష మరువకూడదన్నారు. అంతకుముందు తెలుగుతల్లి చిత్రపటానికి పలువురు అధ్యాపకులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, డాక్టర్ యోగేందర్‌సింగ్, డాక్టర్ సి.నరేష్, డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ తోట ప్రసాద్ పాల్గొన్నారు.

నవోదయలో మాతృభాషా దినోత్సవం

యానాం: పట్టణ పరిధిలోని మెట్టకూరులో నవోదయ విద్యాలయలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు జ్యోతిని వెలిగించి అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మాతృభాష విశిష్టత, పుస్తక పఠనం ద్వారా కలిగే మేలును వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.రామారావు, వెంకటేశ్వర్లు, బేగం, తెలుగు అధ్యాపకుడు పాపారావు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఎంఈవోలు గుబ్బల సూర్యప్రకాశరావు, సరెళ్ల దుర్గాదేవిలు మాతృభాష విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తృత్వం పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జొన్నాడ వెంకటేశ్వరరావు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, హెచ్‌ఎం విత్తనాల శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సరిదే సత్యపల్లంరాజు, న్యాయనిర్ణేతలు జి.పెద్దిరాజు, సీహెచ్ జయశ్రీ, ఎం.బాలాజీ పాల్గొన్నారు.

రైతులే ప్రథమ శాస్త్రవేత్తలు



రైతులు, కూలీలను సత్కరించిన రైతు నాయకుడు బొక్కా శ్రీను తదితరులు

అల్లవరం: వ్యవసాయానికి రైతులే ప్రథమ శాస్త్రవేత్తలని రైతు నాయకుడు బొక్కా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రెల్లుగడ్డలో వ్యవసాయక్షేత్రాల వద్ద అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు బుధవారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ ఎన్నో ఆటుపోటులను తట్టుకుని ఏళ్ల తరబడి వ్యవసాయం చేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. భావితరాలకు వ్యవసాయంపై మక్కువ కల్పించకపోతే భవిష్యత్‌లో వ్యవసాయమన్నది చరిత్రగా మిగిలిపోతుందన్నారు. అనంతరం ఆరు దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులు కుడుపూడి వెంకటేశ్వరరావు, మాకే లవరాజు, వాసంశెట్టి రామకృష్ణ, 15 మంది మహిళా కూలీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రైతులు బుర్రా సత్యనారాయణ, వాసర్ల లక్ష్మణరావు, బొమ్మి చంద్రరావు, మొల్లేటి కృష్ణమూర్తి, కొనుకు సంపదరావు, పెట్టా వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు శుభ గణేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

నానో ఎరువులపై అవగాహన సదస్సు



రంగాపురంలో నానో ఎరువులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమలాపురం రూరల్: నానో ఎరువుల పిచికారీ వల్ల పంటలకు అనేక లాభాలు చేకూరుతాయని అమలాపురం వ్యవసాయ అధికారి కడలి ధర్మప్రసాద్ తెలిపారు. రంగాపురం గ్రామంలో సహకార సంఘ చైర్మన్ మామిళ్లపల్లి రాజారావు అధ్యక్షతన నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు నానో ఎరువులను వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇఫ్కో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధికారి గుంటక శ్యామ్‌ప్రసాద్‌బాబు మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీలు అద్భుతంగా పనిచేస్తున్నాయన్నారు. అమలాపురం పరిధిలోని గ్రామాలకు ఇఫ్కో సంస్థ డ్రోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో నానో యూరియా ట్రయిల్స్ నిర్వహించామని చెప్పారు. కార్యక్రమానికి రంగాపురం సహకార సంఘ సీఈవో యేరుబండి శివ, ఆర్‌బీకే ఉద్యోగులు సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారుల పరిహారం ఫైలుకు ఎల్జీ ఆమోదం



సీఎం రంగసామిని సత్కరించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో ఓఎన్‌జీసీ సంస్థ అందజేసిన పరిహారం సొమ్ము లబ్ధిదారులకు అందించేందుకు ఉద్దేశించిన ఫైలుకు బుధవారం ఎల్జీ తమిళిసై సౌందరాజన్ ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. మత్స్యకారులకు పరిహారం అందేలా విశేష కృషి చేసినందుకు పుదుచ్చేరి సీఎం రంగసామికి కృతజ్ఞతలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం రాజ్‌నివాస్‌కు వెళ్లి ఎల్జీ తమిళిసై సౌందరాజన్‌ను సత్కరించారు. బుధవారం ఎమ్మెల్యే అశోక్ విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 5,289 మందికి పరిహారం అందించేందుకు రూపొందించిన జాబితాను ఎల్జీ ఆమోదించారన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆమోదం పొందిన వెంటనే జీఓ విడుదల చేస్తారన్నారు. ఆ జాబితాను ఓఎన్‌జీసీ సంస్థకు పంపించి సంస్థ ఖాతా నుంచి సొమ్ము ప్రభుత్వ ఖాతాకు జమ చేసిన 10 రోజుల్లోనే లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్‌లో రిజిస్టర్ చేసుకున్న కారణంగా మరో 173 మందికి రెండో జాబితాలో పరిహారం వచ్చేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ల పంపిణీ



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

అమలాపురం టౌన్: పట్టణంలోని శ్రీరామనగర్ వార్డు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్, కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. శిబిరంలో చికిత్స చేయించుకున్న ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య కిట్లను చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అందజేశారు. ప్రభుత్వ వైద్యాధికారులు శిబిరంలో వైద్య సేవలందించారు.

పట్టణంలో కమిషనర్ పర్యటన

మున్సిపల్ కమిషనర్ మనోహర్ బుధవారం వేకువజామునే పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. వచ్చే వేసవి కాలంలో పట్టణంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా ప్రధాన నీటి సరఫరా కేంద్రాన్ని తనిఖీ చేశారు. నడిపూడిలోని 44 ఎకరాల రిజర్వాయరును కూడా పరిశీలించి ఆ విభాగం అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే ఆయన రోజుకో మున్సిపల్ విభాగాన్ని తనిఖీ చేస్తున్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు



ముమ్మిడివరం మండల వలంటీర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ



కాట్రేనికోన మండల వలంటీర్లకు అవార్డులు అందించి సత్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

వలంటీర్ల సన్మాన సభలో ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందించే సంక్షేమ సారథులు వలంటీర్లు అని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ శివారు మహిపాల్ చెరువు గ్రాండ్ పార్క్‌లో బుధవారం వేరువేరుగా జరిగిన ముమ్మిడివరం రూరల్, అర్బన్, కాట్రేనికోన మండలాల వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం ఎంపీపీ కోలా గంగాభవానీ, కాట్రేనికోన మండల పార్టీ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నేరుగా వారి ఇంటి వద్దకే తీసుకెళ్లి అందించే వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు జన్మభూమి కమిటీలు ప్రతిపాదించిన వారికే వచ్చేవన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎవరి ప్రమేయం లేకుండానే రేషన్ కార్డు దగ్గర నుంచి ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అందించే స్వేచ్ఛను వలంటీర్లకు కల్పించారన్నారు. వీరి పని తీరు ఆధారంగానే సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపిక చేస్తున్నారన్నారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు తమకు దక్కిన గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం ముమ్మిడివరం, కాట్రేనికోన మండలం, నగర పంచాయతీ పరిధిలో నలుగురికి సేవా వజ్ర, 15 మందికి సేవా రత్న, 758 మందికి సేవా మిత్ర అవార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి శంకరరావు, నేల కిశోర్, కోలా బాబ్జీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, ఏడిద చక్రపాణిరావు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశిబాలమునికుమారి, మండల పార్టీ అధ్యక్షులు జగతా పద్మనాభం, సంసాని నాగేశ్వరరావు, బొంతు సత్యశ్రీనివాస్, రెడ్డి శివన్నారాయణ, కాశి రామకృష్ణ, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బయో సెక్యూరిటీపై కార్మికులకు శిక్షణ



కార్మికులకు సేఫ్టీ కిట్లను అందజేస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: భీమవరానికి చెందిన ది మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలెప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక సర్కిల్ ది యానాం సమావేశ హాలులో బయో సెక్యూరిటీ అండ్ పర్సనల్ హైజీన్ ఇన్ ఆక్వాకల్చర్ ఫామ్స్ అనే అంశంపై బుధవారం కార్మికులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌ఏఓ మునిస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఆక్వాసాగులో రైతులు, కార్మికులు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆక్వా చెరువులు కలుషితం కాకుండా చూసుకోవడం ద్వారా వైరస్ బారి నుంచి పంట సాగును కాపాడుకోవచ్చన్నారు. అనంతరం కార్మికులకు సేఫ్టీ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ గొంతియ్య, ఆక్వాకల్చర్ సంఘ అధ్యక్షుడు కొండమూరి భాస్కర్, విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం



ఉప్పలగుప్తంలో వలంటీర్లను సత్కరిస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్లు ప్రజాసేవకులుగా మెలిగి ప్రజల మన్ననలు పొందుతున్నారని సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిన్నవరాజు అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవామిత్రలుగా ఎంపికైన 47 మంది వలంటీర్లను దుశ్శాలువాలతో సత్కరించి ప్రభుత్వం ద్వారా వచ్చిన నగదు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోకా శ్రీనివాసరావు, మోటూరి సత్యంకాపు, కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో



చల్లపల్లిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవ వర్ధన్‌రెడ్డి

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి సచివాలయం–3 పరిధిలో జరుగుతున్న జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను బుధవారం అమలాపురం ఆర్డీవో జి.కేశవ వర్ధనరెడ్డి పరిశీలించారు. గ్రామంలో 455 ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు అందించగా ఇప్పటివరకూ 235 ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు పూర్తయినట్టు ఆర్‌డీవో కేశవ వర్ధన్‌రెడ్డి తెలిపారు. మిగిలి ఉన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌లను వేగవంతం చేయాలని డీటీ వైవీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, వీఆర్వో ఎం.శ్రీరామ్, సచివాలయ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

యానాం: యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య పౌరుడిగా తమ కర్తవ్యాన్ని నిర్వహించిన వారవుతారని డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ చల్లా నరేష్ పేర్కొన్నారు. బుధవారం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, యానాం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక మదర్ థెరిస్సా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఓటుహక్కు, నమోదు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయసాగర్, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణసుధాకర్, యువజన అధికారి తిర్రి గోపి, ప్రిన్సిపాల్ కనకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాయకర్‌కు నివాళి

తాళ్లరేవు: విద్యా ప్రదాత మల్లాడి సత్యలింగ నాయకర్ 109వ వర్ధంతిని బుధవారం తాళ్లరేవు మండలంలో ఘనంగా నిర్వహించారు. కోరంగి పంచాయతీ పెద్దబొడ్డు వెంకటాయపాలెంలో అగ్నికుల క్షత్రియ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నాయకర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితుడే దొంగలను పట్టించాడు

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంకకు చెందిన పెద్దిరెడ్డి సత్తిబాబు తన పుంగనూరు గిత్త మాయమవడంతో పోలీసులకు ఫిర్యాదుచేయడంతో పాటు బంధువులతో కలిసి గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో తాళ్లరేవు మండలం సుంకరపాలెంలోని ఓ కబేళాలో తన ఆవును గుర్తించిన సత్తిబాబు పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసుల విచారణలో మురమళ్లకు చెందిన తండ్రీకొడుకులు సదరు గిత్తను కబేళాకు విక్రయించినట్లు తేలింది. దీంతో వారిద్దరితో పాటు గిత్తను తరలించేందుకు సహకరించిన వ్యాను డ్రైవర్, కబేళా నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పుంగనూరు గిత్తను, వ్యాన్‌ను ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పాలూరి మృతికి సంతాపం

అమలాపురం రూరల్: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాలూరి శ్రీనివాసరావు మృతికి స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో సంతాపం తెలిపారు. పాలూరి చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్ గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంపరాల భాస్కర శాస్త్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపినవారిలో రాష్ట్ర మహిళా మోర్చా కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సునీత ఆదిలక్ష్మి, బొంతు శివాజీ, బొచ్చు ప్రభాకర్‌లున్నారు.